క్లుప్తంగా

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

రామాపురం : మండలంలోని 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఏఎస్‌డబ్ల్యూ శ్రీనివాస్‌మూర్తి పేర్కొన్నారు. మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ వసతి గృహాలను మంగళవారం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను, హాస్టల్ వార్డెన్ అనుపమను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గదులు నిత్యావసర సరుకులు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని వసతులు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులకు కోచింగ్ బాధ్యత వార్డెన్ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు వసతులు సక్రమంగా ఉన్నాయో లేదా అని ఆయన గదులను పరిశీలించారు.

విద్యార్థులకు అభినందన



ఫైనల్‌కు చేరుకున్న విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు : జాతీయస్థాయిలో ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా జరిగే నేషనల్ స్టూడెంట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ (ఎస్ఎస్ఐసీ) – 2025 సీజన్–8 పోటీల్లో వరుసగా రెండోసారి ఫైనల్‌కు గొబ్బిళ్ల అక్షర స్కూల్ విద్యార్థులు ఎస్.లక్ష్మీ చైతన్య, ఎస్.జైనాబ్‌లు ఎంపికయ్యారు. వీరు ఫిబ్రవరి 20న బెంగుళూరులో జరిగే పరీక్షలో పాల్గొంటారని తెలిపారు. మంగళవారం ఫైనల్‌కు చేరిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెండ్ గొబ్బిళ్ల శ్రీనాథ్, మెంటర్ వరప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యకర్తకు ఘన నివాళి



రెడ్డయ్య మృతదేహానికి నివాళి అర్పిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కస్తూరిరాజుగారి పల్లి గ్రామం గంధంవారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పి.రెడ్డయ్య (52) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. స్థానిక నాయకులు ద్వారా సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డితో కలిసి మంగళవారం గంధంవారిపల్లెకు వెళ్లి రెడ్డయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం రెడ్డయ్య మృతిపట్ల సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దిక నాగిరెడ్డి, ఎంపీటీసీలు శంకర్ నాయుడు, లక్ష్మినారాయణ, ఉప సర్పంచ్ రాజారెడ్డి, చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు నారద, సభాపతి నాయుడు, జగన్నాథ నాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చాగలగుట్టపల్లెకు చెందిన ఈశ్వరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. చాగలగుట్టపల్లెకు శ్రీకాంత్ రెడ్డి, సుదర్శన్ రెడ్డిలు వెళ్లి ఈశ్వరయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సమావేశమై పలు విషయాలపై చర్చించారు.

మద్యం మత్తులో ఆటో డ్రైవర్ వీరంగం



మద్యం మత్తులో వీరంగం సృష్టిస్తున్న ఆటో డ్రైవర్

సుండుపల్లె : మండల కేంద్రంలో మద్యం మత్తులో ఆటో డ్రైవర్ వీరంగం సృష్టించాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం పూటుగా మద్యం సేవించిన ఓ ఆటో డ్రైవర్ ద్విచక్రవాహనదారులను, పాదచారుల మీదకు ఆటోను నడుపుతూ భయభ్రాంతులకు గురిచేశాడు. పలువురు వాహనదారులు ఆటోను అడ్డగించి ఆపినందుకు వారిని దుర్భాషలాడినట్టు చెప్పారు. పోలీసులు వాహనదారులకు నిబంధనలు తెలియజేస్తున్నప్పటికీ ఇలాంటి సంఘటనలు జరగడంపై మండలకేంద్రం వాసులు పెదవివిరుస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు పగటిపూట కూడా చేపట్టాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు. అలానే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని విన్నవించారు.

పరీక్ష సామగ్రి వితరణ

పెనగలూరు : మండలంలోని కస్తూర్బా పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. వాసవీ సహృదయ సంస్థ వారి సహకారంతో ఎస్టీయూ నాయకులు ఈ పరీక్ష కిట్‌ను అందజేశారు. విద్యార్థులు పరీక్షకు వెళ్లు సమయంలో ఈ పరీక్ష కిట్ చాలా ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ సహృదయ సంస్థ జనరల్ సెక్రటరీ జగన్, ఆర్థిక కార్యదర్శి యశ్వంత్, ఎస్టీయూ రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల కమిటీ కన్వీనర్ పి.ఎల్లయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆ మలుపులు.. మృత్యు పిలుపులు



సింగారెడ్డిపల్లి మలుపు వద్ద బోల్తాపడిన ట్రాక్టర్ (ఫైల్)



ప్రమాదకరంగా ఉన్న మరో మలుపు

- ప్రమాదకరంగా సింగనమల – సింగారెడ్డిపల్లి ఆర్ అండ్ బి రోడ్డు
- తరుచూ యాక్సిడెంట్‌లతో వాహనదారుల్లో భయాందోళన

పెనగలూరు : మండలంలోని సింగనమల – సింగారెడ్డిపల్లి మార్గంలో ఆర్అండ్‌బీ రోడ్డు మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. సింగనమల నుంచి చెరువు వరకు 200 మీటర్లకు ఒకటి చొప్పున ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. సింగారెడ్డిపల్లి మలుపు వద్ద అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఎదురుగా వాహనాలు తగలకపోయినా ఈ మలుపు వద్ద పొలాల్లోకి బోల్తాలు పడి కూడా పలువురు ప్రాణాలు కోల్పోయారు. మలుపువద్దనే కల్వర్టు కూడా ఉండటంతో ప్రమాదకరంగా ఉంది. అలాగే సింగనమల బస్టాండ్ నుంచి అతి తక్కువ దూరంలో మలుపువద్ద ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలలో వాహనదారులు గాయాలపాలయ్యారు. వంద మీటర్ల దూరంలో మరో మలుపు వద్ద వాహనాలు బోల్తాపడిన సంఘటనలు అనేకం జరిగాయి. చెరువుకు పెనగలూరు వెళ్లే రోడ్డు మార్గంలో కల్వర్టు దగ్గర ఉన్న మలుపువద్ద చాలా ప్రమాదకరంగా తయారైంది. ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఆరు మలుపులు ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారీన పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు ఇప్పటికే ఎన్నోసార్లు ఈ మలుపులు వెడల్పు చేయాలని ప్రజలు కోరుకున్నా స్పందన కరువైందని తెలియజేస్తున్నారు. ఎక్కువగా ద్విచక్ర వాహనాలు ట్రాక్టర్లలో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ఈ మలుపుల వద్ద వెళ్లాలంటే భయం గుప్పెట్లో ప్రయాణం చేస్తున్నారు. కొత్తవారు రాత్రిలో ఈ మార్గం గుండా రావాలంటే ఈ మలుపుల వద్ద భయం గుప్పిట్లో ప్రయాణం చేస్తున్నారు. ముఖ్యంగా కొత్తవారైనా, పాతవారైనా ద్విచక్ర వాహనదారులు ఈ మలుపులు రాగానే ఆచితూచి ప్రయాణం చేసున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు మలుపుల వద్ద రోడ్డును వెడల్పు చేసి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనాల్లో వెళ్లాలంటే భయమేస్తుంది



వాహనాలలో రాజంపేట వైపు వెళ్లాలంటే మలుపుల వద్ద భయమేస్తుంది. సింగనమల క్రాస్ నుంచి సింగారెడ్డిపల్లి వరకు ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపులను సరిచేసి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– గుండ్లూరు వెంకటేష్, సింగనమల, పెనగలూరు మండలం

దారిని వెడల్పు చేయాలి



సింగారెడ్డిపల్లి వద్ద ఉన్న మలుపు ప్రమాదకరంగా ఉంది. మేము రోజూ ఈ దారి మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. వాహనాల్లో ప్రయాణం చేస్తున్నప్పుడు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వాహనం నడుపుతున్నాం. అధికారులు ప్రమాదకరంగా ఉన్న మలుపులను వెడల్పు చేసి ప్రమాదాలను నివారించాలి.

– ఈశ్వరయ్య, కంబాలకుంట, పెనగలూరు మండలం

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపల్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వాసుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు మున్సిపల్ సభా భవనంలో మున్సిపల్ ఛైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అధ్యక్షతన సమావేశం నిర్వహింపబడుతుందన్నారు. సమావేశంలో 2025 – 26 సంవత్సరం సాధారణ బడ్జెట్‌తోపాటు పట్టణాభివృద్ధి, ప్రజాసమస్యలపై చర్చ జరుగుతుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శాసనసమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానంలు హాజరవుతారన్నారు. సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులతో పాటు అన్ని శాఖల అధికారులు తప్పక పాల్గొనాలంటూ కోరారు.

రామాపురం : మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ సభా భవనంలో బుధవారం ఉదయం 10గంటలకు మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జాషువ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు. ఈ సమావేశంలో అన్ని శాఖలపై సమీక్ష ఉంటుందన్నారు.

21న మండల సమావేశం

సుండుపల్లె : మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 21వ తేదీ శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని వారు కోరారు.

రబీలో ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి

సిద్దవటం : ప్రస్తుత రబీ సీజన్‌లో సాగు చేసిన అన్ని రకాల పంటలను ఇ–క్రాప్‌తోపాటు ఈకేవైసీ ప్రక్రియకు చేయించాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలన్నారు. అలాగే సొంత భూమి కలిగి ఉన్న, డీకేటీ భూముల రైతులు కూడా 11 అంకెల రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా పొందాలన్నారు. దీనికి గాను ఆధార్‌కార్డు, ఆధార్‌తో లింక్ కలిగిన మొబైల్ నెంబర్, పట్టాదారు పాసు పుస్తకంతో రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. అలాగే సాగులో ఉన్న వరి, ఆకుకూరల పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. వరి కరుకు పొట్ట దశలో తప్పనిసరిగా ఎకరాకు కనీసం 25 కిలోలు పొటాష్ తప్పనిసరిగా వేయాలన్నారు. రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతు సేవా కేంద్ర వ్యవసాయ సహాయకులు లక్ష్మిదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాచుపల్లెలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా తోడుంటా



గాలివీడు: నల్లబత్తుని వెంకటరెడ్డిని పరామర్శిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి



రామాపురం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : గాలివీడు మండల జేసీఎస్ కన్వీనర్ నల్లబత్తుని వెంకటరెడ్డిని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల గాలివీడు ఘటనలో చేతికి గాయమై శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి పొందుతున్న వెంకటరెడ్డిని మంగళవారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని ఆయన భరోసానిచ్చారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై ఎల్లవేళలా తోడుంటానని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతంపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషణ రెడ్డి, నాయకులు ఖాదర్ మోహిద్దీన్, సర్పంచులు ఉమాపతి రెడ్డి, కేశవరెడ్డి, రామాంజులు రెడ్డి, ఉమా ప్రభాకర్, దీప్తి, వైస్ ఎంపీపీ గాలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె కొత్తపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సూరం ధృవకుమార్‌రెడ్డి ఇటీవల ప్రమాదానికి గురై కాలు విరగడంతో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న విషయం తెలుసకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే కొత్తపల్లెకు లోమోకాలి మార్పిడి చేయించుకున్న అవటాల రమాదేవి పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ శివశంకర్, మునిరెడ్డి, రాఘవరెడ్డి, జనార్దనరెడ్డి, సూర్యచంద్రారెడ్డి, నరసింహరెడ్డి, నరేంద్రారెడ్డి, రెడ్డయ్య, కృష్ణయ్య, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ

సిద్దవటం : సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేస్తున్న ఉచిత స్టడీ మెటీరియల్‌ను మంగళవారం సిద్దవటం మండలంలోని అన్నీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిద్దవటం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థులకు సాక్షి అందజేసిన స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు ఈ మెటీరియల్‌ను చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించినప్పుడే సార్ధకత ఉంటుందన్నారు. కార్యక్రమంలో సాక్షి దినపత్రిక ఏసీఎం మునికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న హెచ్ఎం శ్రీరాములు

భూ సమస్యలను పరిష్కరించండి

జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

సిద్దవటం : మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సులపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నుంచి శుక్రవారం వరకు జిల్లాలోని రెండు మండలాలను తనిఖీ చేసి సిబ్బంది తీరును పర్యవేక్షిస్తున్నామన్నారు. అందులో భాగంగా సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్, భూ రీసర్వే, గ్రీవెన్స్ పరిష్కారం, సిబ్బంది పనితీరును పర్యవేక్షించడం జరిగిందన్నారు. సిద్దవటం మండలం లోని ఉప్పరపల్లె మాధవరం–1 గ్రామ పంచాయతీలలో జరుగుతున్న భూ కబ్జాలను అరికట్టాలని కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్‌కు ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్, ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత, ఆర్ఐ ప్రసాద్, వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులలో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలి



ఓబులవారిపల్లె: అంగన్‌వాడీ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎంఈఓ రెడ్డయ్య



చిట్వేలి : శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీఓ నిర్మలాజ్యోతి తదితరులు

రామాపురం : చిన్నారులలో పూర్వ ప్రాథమిక దశలో అభ్యసన సామర్థ్య పునాదులు మెరుగుపరచాలని అంగన్‌వాడీ వర్కర్లకు డిప్యూటీ డీఈఓ శివప్రకాష్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పద్మావతి సూచించారు. మంగళవారం మండలంలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా జ్ఞానజ్యోతి 120 శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. మొదటి రోజున డిప్యూటీ డీఈఓ హాజరై మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ఆరు రోజులపాటు నిర్వహిస్తారని, ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని అంగన్‌వాడీ కేంద్రానికి మూడు సంవత్సరాల చిన్న పిల్లలు వస్తుంటారని, పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ కేంద్రాల నుంచే అందించాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు, డీఆర్పీలు కుమార్‌స్వామి, వెంకటసుబ్బయ్య, పార్థసారథి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాతరెడ్డి, హుస్సేనమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : ప్రత్యేక శిక్షణ తరగతుల ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు మెరుగైన విధి విధానాలను అవలంబించాలని ఎంఈఓ, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ రెడ్డయ్య పేర్కొన్నారు. మంగళవారం ముక్కవారిపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను రెడ్డయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు రోజుల శిక్షణ ద్వారా క్షుణ్ణంగా అవగాహన చేసుకుని పిల్లలకు సమగ్రాభివృద్ధిని పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు సీడీపీఓ సౌభాగ్యమ్మ ఏసీడీపీఓ సరళ దేవి ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర రాజు అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక ఉన్నత పాఠశాలలో ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ నిర్మలా జ్యోతి, సూపర్‌వైజర్లు వసుందరమ్మ, సురేఖా రాణి, రాజేశ్వరి, ఎంఈఓ కోదండనాయుడు, ప్రధానోపాధ్యాయులు ఏబీఎస్.ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, డీఆర్పీలు ఓబుల్ రెడ్డి, సురేంద్ర, శ్రీహరి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నేడు

చిట్వేలి : బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 19వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10:30గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్ మంగళవారం తెలియజేశారు. బ్యాంకుల ప్రతినిధుల సమక్షంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ అప్లికేషన్, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకొని ఇంటర్వ్యూకు హాజరు కావాలంటూ ఎంపీడీఓ కోరారు.

సంబేపల్లె : సబ్సిడీ రుణాల కోసం మండల వ్యాప్తంగా దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరూ నేడు బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. బ్యాంక్ మేనేజర్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రభావితం చేయగలిన వారే నాయకులవుతారు

ఎస్వీయూ మాజీ వీసీ శ్రీకాంత్ రెడ్డి

కురబలకోట : నాయకత్వం అంత సులభం కాదు.. ఎవరైతే పరిస్థితులకు, కాలానికి అనుగుణంగా మలచుకుంటూ ప్రభావితం చేయగలుగుతారో అలాంటి వారు గొప్ప నాయకులుగా ఎదుగుతారని తిరుపతి శ్రీ వేంకటేశ్వర (ఎస్వీ)యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ వి. శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో భవిష్యత్ నాయకుల కోసం వ్యక్తిత్వ వికాసం..వ్యక్తిగత, మానసిక అంతర్దృష్టులు అనే అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో వ్యక్తిత్వ వికాసం భవిష్యత్ నాయకులను తీర్చి దిద్దడంలో కీలకమైన అంశమన్నారు. జీవితంలోనైనా కేరీర్, మరే రంగంలో సక్సెస్ కావాలంటే నాయకత్వ లక్షణాలు తప్పనిసరియన్నారు. ఇందుకు గొప్ప వ్యక్తులను, వారి వ్యక్తిత్వాలను పరిశీలించడం ద్వారా విద్యార్థులతో పాటు ఎవ్వరైనా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చన్నారు.

పౌల్ట్రీఫామ్ యజమానికి నోటీసులు



పౌల్ట్రీఫామ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దంమద్యం : మండలంలోని శివపురంకు సమీపంలో పౌల్ట్రీఫామ్ నడుపుతున్న యజమానికి మంగళవారం నోటీసు జారీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. పౌల్ట్రీఫామ్‌కు సమీపంలోని శివపురంలో ఈగల బెడద ఎక్కువ కావడంతో గ్రామస్థులు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. దీంతో పౌల్ట్రీఫామ్‌ను ఎంపీడీఓ పరిశీలించారు. పారిశుద్ధ్యం లోపం లేకుండా చూసుకోవాలని యజమానికి సూచించారు.

ఇంటర్వ్యూలకు 400 మంది హాజరు

రామాపురం : మండలంలోని 13 గ్రామాల పంచాయతీ పరిధిలో 500 మంది దరఖాస్తు చేసుకోగా 400 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ జాషువా మంగళవారం పేర్కొన్నారు. మాట్లాడుతూ మండల వ్యాప్తంగా కాపు, బీసీలకు సబ్సిడీ రుణాలకు 40 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. అందులో 10 యూనిట్లు కాపులకు 30 యూనిట్లు బీసీలకు కేటాయించి ఇంటర్వ్యూలు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇంటర్వ్యూలను అన్ని బ్యాంకుల మేనేజర్లను అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని ఆయా బ్యాంకు మేనేజర్లు, ఫీల్డు ఆఫీసర్లు తెలిపారు.

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఓబీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలను నిర్వహించారు. మండలంలో 250 మంది దరఖాస్తు చేసుకోగా 156 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఎంపీడీఓ కెఆర్ఎం ప్రసాద్ తెలిపారు. బ్యాంకుల వారీగా ఇంటర్వ్యూలు జరిగిన లెక్క ప్రకారం ఉప్పరపల్లి ఏపీజీబీకి 14, ఒంటిమిట్ట ఏపీజీబీకీ 30, కొత్తమాధవరం ఎస్‌బీఐకి 29, ఒంటిమిట్ట ఎస్‌బీఐకి 53, ఒంటిమిట్ట యూనియన్ బ్యాంకు 30 చొప్పున దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

సరైన ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలి

వీరబల్లి : మండలంలోని యువతీ యువకులు, నిరుద్యోగులు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలుకోసం దరఖాస్తులు చేసుకన్న వారికి నేడు బుధవారం ఇంటర్వ్యూలు జరుగనున్నాయని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించాలి

పెనగలూరు : మండలంలో ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిని అవలంబించాలని ప్రకృతి వ్యవసాయ పెనగలూరు యూనిట్ ఇన్‌చార్జ్ చాపల లక్ష్మీదేవి సూచించారు. మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఆమె కొండూరు యూనిట్ ఇన్‌చార్జ్ శైలజతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



కూరగాయలను విక్రయిస్తున్న మహిళా రైతు